క్లుప్తంగా

ఈ నెలాఖరుతో ఈ-క్రాప్ గడువు పూర్తి


ఈ- క్రాప్ నమోదు చేస్తున్న ఏవో వాసుదేవ రావు, ఆర్బీకే అసిస్టెంట్ గౌరునాయుడు

మాడుగుల: ఖరీఫ్ సాగుకు సంబంధించి ఈ - క్రాప్ నమోదు చురుగ్గా సాగుతోంది. మండలంలో అన్ని రకాలు పంటలు కలిపి 14 వేల ఎకరాల్లో సాగు చేయగా, ఇంతవరకు ఐదు వేల ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు అయిందని వ్యవసాయాధికారి ఎం. వాసుదేవరావు తెలిపారు. మిగిలిన రైతులు ఈ- క్రాప్ నమోదుతో పాటు ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. ఆర్బీకేల వద్ద ఈ- క్రాప్ నమోదు చేసుకోకపోతే ప్రభుత్వ పరంగా అందించే రాయితీలు అందవని తెలిపారు. ఖరీఫ్ సాగు చేసుకున్న రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గణనాథుడికి లక్ష బిల్వార్చన


లక్ష బిల్వార్చన కార్యక్రమంలో భక్తులు

మాడుగుల: వినాయక నవరాత్రుల్లో భాగంగా సోమవారం స్థానిక మూడు రోడ్ల కూడలి వద్ద వినాయక మండపంలో స్వామివారికి లక్ష బిల్వార్చన నిర్వహించారు. బాల వినాయక సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులతోపాటు వినాయక మాలధారులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు సత్వరమే పరిష్కారం

నర్సీపట్నం ఆర్డీవో జయరాం


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం అధికారులకు సూచించారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన)లో ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. సమగ్ర శిక్షా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ వారం డివిజన్ వ్యాప్తంగా 17 అర్జీలు వచ్చాయి. ఎక్కువగా భూసమస్యలు, రేషన్ కార్డులు, శానిటేషన్, సదరం సర్టిఫికెట్లపై ఉన్నాయి. స్పందనలో వచ్చే ప్రతి ఫిర్యాదులకు పరిష్కారం చూ పాలని మండల స్థాయి అధికారులకు సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించవద్దన్నారు.

క్యాన్సర్‌పై విద్యార్థులకు అవగాహన


క్యాన్సర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రామ్మోహన్‌రావు

అనకాపల్లిటౌన్: క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, క్యాన్సర్ సోకిన రోగికి సకాలంలో వైద్యసేవలు అందిస్తే ఆరోగ్యంగా జీవించవచ్చని ఏఎంఏఎల్ కళాశాల విశ్రాంత రసాయనశాఖాధిపతి కె.రామ్మోహన్‌రావు అన్నారు. స్థానిక డీఏవీ స్కూల్లో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని, క్యాన్సర్ లక్షణాలు, చికిత్సా పద్ధతులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో క్యాన్సర్ కేసులు పెరుగుతుండటం బాధాకరమన్నారు. ప్రస్తుత జీవనశైలి, క్యాన్సర్‌పై నిర్లక్ష్య ధోరణి, అవగాహనా రాహిత్యమే కారణమన్నారు. క్యాన్సర్ నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. మహిళలకు వచ్చే గర్భాశయ, అండాశయ, రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రిన్సిపాల్ ఎల్.లక్ష్మీశారద, ఉపాధ్యాయులు దుర్గారాణి, డీపీ లక్ష్మి పాల్గొన్నారు.

ఇంటింటా ఆరోగ్యం

చురుగ్గా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

సాధారణ రోగాలతోపాటు దీర్ఘకాలిక వ్యాధులను నయం చేసి అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం. ఈ నేపథ్యంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చివరి దశకు చేరుకుంది. ఇంటింటా వైద్య సిబ్బంది తిరిగి నమోదు చేసుకున్న రోగులకు నాణ్యమైన వైద్యం అందించడానికి ఈ నెల 30 నుంచి శిబిరాలు నిర్వహించనున్నారు.


మాడుగుల రూరల్: పోతనపూడిలో సుగర్ పరీక్ష చేస్తున్న ఎం.ఎల్.హెచ్.పి వరలక్ష్మి, సిబ్బంది

మాడుగుల రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే పక్కాగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గ్రామాల్లో సచివాలయాలు, ఏఎన్ఎంలు, ఎం.ఎల్.హెచ్.పిలు, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు కలిసి ప్రతి ఇంటిని జల్లెడ పడుతున్నారు. ఇంట్లో ఎవరైనా అనారోగ్యానికి గురైతే వారి వివరాలు నమోదు చేస్తున్నారు. బీపీ, సుగర్, ఇతర వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి, వారి వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. కె.జె.పురం, కింతలి పీహెచ్‌సీల పరిధిలోని 19 గ్రామ సచివాలయాల్లో సర్వే చేస్తున్నారు. ఎం. కోడూరు, పోతనపూడి, తదితర గ్రామాల్లో సర్వేను సోమవారం వారు పర్యవేక్షించారు.

కె.కోటపాడు: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం కలగనున్నట్లు లంకవానిపాలెం పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ జె.సన్యాసిరావు, హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్ తెలిపారు. సోమవారం పోతనవలసలో ఇంటింటి ఆరోగ్య సర్వే చేశారు. ఉగ్గినవలస, పోతనవలస, ఆర్.వై.అగ్రహారం గ్రామాల్లో 450 కుటుంబాల ఆరోగ్య వివరాలను నమోదు చేశారు. వీటితోపాటు పక్షవాతం, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి ప్రత్యేక వైద్యం అందించి సంపూర్ణ ఆరోగ్యం పొందేటట్లు చర్యలు తీసుకోనున్నట్లు హెల్త్ సూపర్‌వైజర్ వివరించారు. వలంటీర్‌లు, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


బుచ్చెయ్యపేట మండలం పి. భీమవరంలో మహిళకు టెంపరేచర్ పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది


మాడుగుల రూరల్:ఎం. కోడూరులో బి.పి. పరీక్ష చేస్తున్న ఏఎన్ఎం సావిత్రి ఆశ కార్యకర్త


బుచ్చెయ్యపేట మండలం సీతయ్యపేటలో మహిళకు రక్త పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది


కె.కోటపాడు: పోతనవలసలో బీపీ పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది


బుచ్చెయ్యపేట : రాజాంలో ఇంట్లో వృద్ధుడికి బీపీ చెక్ చేస్తున్న వైద్య సిబ్బంది

నిర్ణీత వ్యవధిలో అభివృద్ధి పనులు పూర్తి

నర్సీపట్నం మున్సిపల్ ఛైర్‌పర్సన్ సమీక్ష

నర్సీపట్నం: అభివృద్ధి పనులను నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధికారులకు సూచించారు. అభివృద్ధి పనులు, శానిటేషన్, అక్రమ కట్టడాలపై సోమవారం ఆమె సమీక్ష నిర్వహించారు. మున్సిపాలిటీలోని 17 సచివాలయాల్లో ఒక్కొక్క సచివాలయంలో రూ.50 లక్షలతో చేపట్టిన సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణంపై అధికారులను ఆరా తీశారు. పట్టణంలో భవన నిర్మాణాల గురించి టౌన్‌ప్లానింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులు నాణ్యత జరిగేలా సంబంధిత కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు బాధ్యత తీసుకోవాలన్నారు. శానిటేషన్ విషయంలో ఫిర్యాదులు రాకుండా ఎప్పటికప్పుడు వార్డుల్లో పనులు చేపట్టాలన్నారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ కోనేటి రామకృష్ణ మాట్లాడుతూ టౌన్‌లో విచ్చల విడిగా చేపట్టిన అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టే కట్టడదారులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ కనకారావు, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, సచివాలయ, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి

తక్కువ చార్జీతో ఆర్టీసీ పార్సిల్ సర్వీసు

ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ అప్పలనాయుడు

నర్సీపట్నం: ప్రజా రవాణాతోపాటు ఆర్టీసీ సంస్థ అందుబాటులోకి తీసుకువచ్చిన పార్సిల్, కొరియర్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజ్ బి.అప్పలనాయుడు పేర్కొన్నారు. సోమవారం ఆయన నర్సీపట్నం డిపోను సందర్శించారు. ఇక్కడ సౌకర్యాలు గురించి డిపో మేనేజర్ ఎంఎస్ఎన్.ధీరజ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆర్టీసీ అభివృద్ధికి ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పార్సిల్ కౌంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సౌలభ్యం కోసం పార్సిల్ సర్వీసు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. తక్కువ చార్జీలతో అతి వేగంగా సురక్షితంగా రవాణా చేస్తున్నామన్నారు.


పార్సిల్ సర్వీసు కౌంటర్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ అప్పలనాయుడు

పశువుల్లో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

బుచ్చెయ్యపేట: వర్షాకాలంలో పశువుల్లో వస్తున్న సీజనల్ వ్యాధుల పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ టి. చిన్నంనాయుడు తెలిపారు. సోమవారం లోపూడి రైతు భరోసా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. పశువుల్లో వస్తున్న వ్యాధులు, నివారణ, అధిక పాల దిగుబడిపై రైతులకు అవగాహన కల్పించారు. పశువులను మేతకు తీసుకెళ్లేటపుడు గుంతల్లో మురుగు నీరు తాగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పశువుల పాకల వద్ద పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పశువులకు వ్యాపిస్తున్న గాలికుంటు వ్యాధి, నట్టల నివారణ, లంపీస్కిన్ వ్యాధులను గుర్తించి సకాలంలో వైద్యులను సంప్రదించి తగిన నివారణ మందులను వినియోగించాలన్నారు. పశువుల్లో కొత్తగా వచ్చిన ఆడ దూడలు మాత్రమే పుట్టే ఇంజక్షన్‌ల గురించి, టీఎంఆర్ మిశ్రమ దాణా గురించి రైతులకు అవగాహన కల్పించారు. వడ్డాది ప్రభుత్వ పశు ఆస్పత్రి వైద్యులు శివ కుమార్, వీఆర్వో జె. సుధాకర్, ఆర్బీకే పశు సంవర్ధక శాఖ సహాయకుడు సాయి పాల్గొన్నారు.


లోపూడిలో పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ చిన్నంనాయుడు

మండల సర్వసభ్య సమావేశం రేపు

బుచ్చెయ్యపేట: ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సువర్ణరాజు తెలిపారు. మండల పరిషత్ మీటింగ్ హాలులో ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గౌరవ సభ్యులు హాజరు కావాలన్నారు. సమగ్ర సమాచారంతో ఆయా శాఖల అధికారులు పాల్గొనాలన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు థర్డ్ కౌన్సెలింగ్

నర్సీపట్నం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు థర్డ్ కౌన్సెలింగ్ అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టరు ఎస్.రాజు తెలిపారు. బీఏ-2, బీకాం-9, బీఎస్సీ ఫిజిక్స్-31, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్-9, బీఎస్సీ బోటనీ-5, బీఎస్సీ కెమిస్ట్రీ-6 సీట్లు మిగిలి ఉన్నాయన్నారు. ఈ సీట్లు భర్తీకి థర్డ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు ఈ నెల 27వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

చెరకు టన్నుకు రూ.4,500 చెల్లించాలి

ఏపీ కౌలు రైతు సంఘం డిమాండ్

చోడవరం రూరల్: గోవాడ సహకార చక్కెర కర్మాగారానికి రానున్న సీజన్‌లో చెరకు టన్నుకు రూ.4,500 చెల్లించాలని ఏపీ కౌలు రైతు సంఘం డిమాండ్ చేసింది. సోమవారం స్థానిక కమ్యూనిస్టు పార్టీ కార్యాలయం వద్ద జిల్లా కౌలు రైతుల సంఘం సమావేశం జరిగింది. మంగళవారం జరగనున్న ఫ్యాక్టరీ సర్వజన సభలో ఈ మేరకు తీర్మానం చేయాలని సమావేశం కోరింది. సంఘం ప్రధాన కార్యదర్శి వర్రి వరహాలుబాబు మాట్లాడుతూ గత సీజన్‌లో ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేసిన రైతాంగానికి చివరి చెల్లింపులు నేటికీ చేయలేదన్నారు. వడ్డీలకు పెట్టుబడి సొమ్ము తీసుకున్న రైతులకు మరో సీజన్ వచ్చేవరకు చెల్లింపులు చేయకుంటే వారిపై వడ్డీ భారం పెరుగుతుందన్నారు. ఫ్యాక్టరీ ద్వారా గతంలో మాదిరిగా వడ్డీ లేని రుణంపై ఎరువులు, విత్తనం సరఫరా చేయాలన్నారు. రైతుల పట్ల మొండివైఖరి అవలంబిస్తున్న ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ నేటికైనా చెరకు బకాయిలను చెల్లించాలని, లేకుంటే రైతుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో సంఘ బాధ్యులు రాము, ఎర్రినాయుడు, శ్రీను కసిరెడ్డి దేవుడునాయుడు, బుల్లబ్బాయి పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే రాజ్యాంగంపై అవగాహన

ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు రమణ

దేవరాపల్లి: విద్యార్థి దశ నుంచే ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ సూచించారు. ఇన్‌చార్జి ఎంఈవో, హెచ్ఎం బి. పడాల్‌దాస్ అధ్యక్షతన సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ప్రజా స్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ప్రధానంగా మంచి పౌర సమాజం, ప్రతీ పౌరుడికి రాజ్యాంగంపై అవగాహన కల్పించడం, సమాచార హక్కు చట్టం అవినీతి నిర్మూలన తదితర అంశాలపై పనిచేస్తుందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక మండలాధ్యక్షుడు కొరుపోలు శ్రీను మాట్లాడుతూ విద్యలో ప్రోత్సహించడమే లక్ష్యంగా టెన్త్ విద్యార్థులకు ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ ఇస్తున్నామన్నారు. ఈ ఏడాది టెన్త్‌లో 95 శాతం మార్కులు సాధించే విద్యార్థులకు రూ.10 వేలు ప్రోత్సాహక బహుమతి అందజేస్తామన్నారు. అనంతరం కొరుపోలు శ్రీను సొంత సొమ్ముతో సమకూర్చిన ఐదు ప్లాస్టిక్ కుర్చీలను హెచ్ఎంకు అందజేశారు. రంధి వెంకటరావు, ఉప్పు అజయ్, ఉపాధ్యాయుడు సత్యనారాయణ పాల్గొన్నారు.


హెచ్ఎంకు కుర్చీలు వితరణ చేస్తున్న రమణ, కొరుపోలు శ్రీను

భూముల రీ సర్వే తిరిగి చేయాలి

అధికారుల నిర్లక్ష్యంపై కలెక్టర్‌కు గౌరీపట్నం రైతుల ఫిర్యాదు

చోడవరం: గౌరీపట్నం రెవెన్యూ పరిధిలో భూముల రీసర్వే ప్రక్రియను స్థానిక రెవెన్యూ అధికారులు సక్రమంగా నిర్వహించలేదని గ్రామ రైతులు వాపోయారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టికి ఫిర్యాదు చేశారు. ఇటీవల గ్రామంలో భూముల రీసర్వే ప్రక్రియ జరిగింది. ఈ సర్వేలో రైతుల భూమంతా వారి రికార్డుల్లో చూపించలేదు. పైగా తమ భూముల వివరాలు, అభ్యంతరాలు చెప్పినప్పటికీ స్థానిక రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలన చేయకుండా కార్యాలయాల్లో కూర్చొని తమకు నచ్చినట్లు రీసర్వే చేశారని సర్పంచ్ కోన లక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు మంగ జగన్నాథరావు, బాధిత రైతులు ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామంలో 60 శాతం భూములు పూర్తిస్థాయిలో రీసర్వే చేయలేదన్నారు. తక్షణమే దీనిపై చర్యలు తీసుకుని తిరిగి తమ గ్రామంలో భూములన్నీ క్షేత్రస్థాయిలో రీసర్వే చేయాలని కోరారు.


కలెక్టర్ కార్యాలయం వద్ద గౌరీపట్నం రైతులు

జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక


రోలుగుంట: బీబీపట్నం విద్యార్థులతో ఉపాధ్యాయులు


దేవరాపల్లి: ముషిడిపల్లి విద్యార్థులతో హెచ్ఎం అప్పలరామ్

రోలుగుంట: జిల్లా స్థాయి క్రీడా పోటీలకు బీబీపట్నం జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్టు హెచ్ఎం ఎస్.అప్పారావు సోమవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల చోడవరంలో నిర్వహించిన అండర్ -17 బాలికల కబడ్డీ పోటీల్లో పి.మహలక్ష్మి, అండర్ -17 బాలుర త్రోబాల్ పోటీలో సిహెచ్ రామకృష్ణ ఎంపికైనట్టు పేర్కొన్నారు. వీరితోపాటు పీడీ కె.సావిత్రిని, హెచ్ఎం, ఉపాధ్యాయులు పి.వి.టి.నాయుడు, శ్యామ్‌సుందర్ అభినందించారు.

దేవరాపల్లి: ముషిడిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థినులు జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికై నట్లు హెచ్ఎం అప్పలరామ్ తెలిపారు. ఇటీవల చీడికాడలో నియోజకవర్గ స్థాయి పోటీల్లో టెన్నికాయిట్ సహా అథ్లెటిక్స్‌లో విద్యార్థినులు జి. దేవి, కౌస్య, లీల, దీపిక, తేజస్విని విశేష ప్రతిభ కనబరిచారన్నారు. వీరిని హెచ్ఎం, ఉపాధ్యాయులు స్థానిక పాఠశాలలో సోమవారం అభినందించారు.

కె.కోటపాడు: ఎ.కోడూరు హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీల్లో చీడికాడలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో అండర్-14 బాలికల విభాగం హైజంప్‌లో కె.ప్రమోదిని, అండర్-14 బాలుర విభాగం హైజంప్‌లో ఎస్.రాము, అండర్-17 బాలుర విభాగం కబడ్డీలో జె.ఓంకార్ వినయ్, జె.లోకేస్, డి.రాహుల్, హైజంప్‌లో ఎస్.రాము, లాంగ్ జంప్, జావెలిన్‌త్రోలో డి.కేశవ, హైజంప్, జావెలిన్‌త్రోలో శ్యామ్సన్, డిస్కస్‌త్రో, హైజంప్‌లో ఎం.చిరంజీవి అర్హత సాధించారు. వీరిని హెచ్ఎం కామేశ్వరరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ లెక్కల అర్జున, తర్రా మోహన్ రావు, ఇన్‌చార్జ్ పీడీ ఆర్.రమేష్ సోమవారం అభినందించారు.


కె.కోటపాడు: విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, తదితరులు


జిల్లా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

స్కూల్ గేమ్స్‌లో సత్తా చాటిన గవరవరం విద్యార్థులు

చోడవరం రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో గవరవరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారు. పాఠశాలకు చెందిన గిరీష యోగా పోటీల్లో ప్రథమ స్థానం, అండర్ -14 విభాగం షాట్‌పుట్ పోటీలో ద్వితీయ స్థానంలో నిలిచింది. అదే విభాగం త్రోబాల్‌లో గీత ప్రథమ స్థానంలో నిలిచింది. అండర్ -17 విభాగంలో పి.హరీష్ కబడ్డీ జట్టుకు, 200, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానాలను పొందాడు. మనోహర్ కబడ్డీ జట్టుకు ఎంపిక కాగా 400 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఎస్. రామకృష్ణ 400 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారు. వీరిని ప్రధానోపాధ్యాయుడు జి.జె.సుందర్ సింగ్, ఫిజికల్ డైరెక్టర్ మోహన్, ఉపాధ్యాయులు అభినందించారు.


గిరీష యోగా విన్యాసం

వాడవాడలా అన్న సమారాధనలు


కె.కోటపాడు: వినాయకుడికి పూజలు చేస్తున్న ఎంపీపీ జగన్‌మోహన్

దేవరాపల్లి: వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా స్థానిక యాదవ కాలనీలో సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు వడ్డన చేసి ప్రారంభించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. తొలుత తెల్లవారుజాము నుంచి వినాయకుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, బంధం అప్పలరాజు, తదితర స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

అన్నిదానాల్లో కెల్లా అన్నదానం మిన్న

కె.కోటపాడు: గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక రామాలయం దగ్గర వినాయక మండపం వద్ద అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ ప్రారంభించి భక్తులకు వడ్డన చేశారు. తొలుత వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకాంత్ శ్రీను, బోకం సత్యనారాయణ, దోకల అప్పలనాయుడు, బుజ్జి, గణేష్ యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రావికమతం: వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా మండలంలో రావికమతం, చినపాచిల, టి.అర్జాపురం, కొత్తకోట గ్రామాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని వినాయక యూత్ సభ్యులు, కొఠారివీధిలో లంబోదర యూత్, తాడుపెద్ద వీధి సిద్ధి వినాయక యూత్ సభ్యుల ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కొత్తకోట 30 అడుగుల వినాయక విగ్రహం వద్ద స్లో బైక్, స్లో సైకిల్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

మాడుగుల రూరల్: గణపతి నవరాత్రోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో ఆదివారం రాత్రి గణనాథులను నిమజ్జనోత్సవం నిర్వహించారు. వీరనారాయణం, కె.జె.పురం గ్రామాల్లో మహిళలు, చిన్నారుల కోలాటం ప్రదర్శనల మధ్య గణేశ్ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువుల్లో నిమజ్జనం చేశారు. పలు గణేశ్ మండపాల వద్ద అఖండ దీపారాధన ఆకట్టుకుంది.


దేవరాపల్లి : యాదవ కాలనీలో వినాయకుడిని దర్శించుకుంటున్న జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కరరావు


రావికమతం: భారీ అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం


రావికమతం: స్లో బైక్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం